# పతక పంచ్ విసరాలని..

## స్వర్ణంపై కన్నేసిన నిఖత్ జరీన్ • లవ్లీనా మెరిసేనా?



నమస్తే తెలంగాణ క్రీడా విభాగం

మనదేశంలో రెజ్లింగ్ (మల్లయుద్ధం) మాదిరిగానే బాక్సింగ్ సైతం పురాతన క్రీడ. మహాభారత కాలంలో 'ముష్టియుద్ధ'గా పేరుగాంచిన నేటి బాక్సింగ్.. 20వ శతాబ్దంలో బాగా ప్రాచుర్యంలోకి వచ్చింది. 1904 ఒలింపిక్స్ (సెయింట్ లూసియా)లో ఈ క్రీడను ప్రవేశపెట్టినా ఆ తర్వాత నాలుగున్నర దశాబ్దాలకు (1948 లండన్ ఒలింపిక్స్‌లో) భారత్ అరంగేట్రం చేసింది. 1972 నుంచి ప్రతి ఎడిషన్‌లోనూ భారత్ ప్రాతినిధ్యం ఉన్నా 2008 బీజింగ్ ఒలింపిక్స్ దాకా మన బాక్సర్లు రిక్తహస్తాలతోనే తిరిగివచ్చారు. కానీ బీజింగ్‌లో విజేందర్ సింగ్ కాంస్య పంచ్ విసిరి దేశానికి తొలి పతకాన్ని తీసుకొచ్చాడు. ఆ తర్వాత 2012లో మేరీ కోమ్, 2020లో లవ్లీనా బోర్గొహెయిన్ కాంస్యాలు నెగ్గారు. పారిస్‌లో భారత్‌కు పతకం తెచ్చే రేసులో ఉన్న ఈవెంట్స్‌లో బాక్సింగ్ కూడా ఒకటి. ఈసారి ఆరుగురు బాక్సర్లతో బరిలోకి దిగుతున్న భారత్.. పతక పంచ్‌లు విసిరేనా?

### స్వర్ణమే లక్ష్యంగా ఇందూరు బాక్సర్..

భారత బాక్సింగ్ చరిత్రలో ఓ సంచలనంగా ఎదిగిన నిజామాబాద్ అమ్మాయి నిఖత్ జరీన్.. పారిస్‌లో స్వర్ణమే లక్ష్యంగా బరిలోకి దిగుతోంది. 2020 టోక్యో ఒలింపిక్స్‌లో మేరీకోమ్‌తో సెలక్షన్ ట్రయల్స్ వివాదం ఆమెలో మరింత పట్టుదలను నింపింది. ఆ తర్వాత 2022, 2023 వరల్డ్ చాంపియన్‌షిప్ పోటీలలో వరుసగా స్వర్ణాలు గెలిచి మేరీకోమ్ వారసురాలిగా గుర్తింపుపొందింది. కామన్వెల్త్‌లో రజతం నెగ్గిన ఈ ఇందూరు అమ్మాయి.. ఆసియా క్రీడల్లో స్వర్ణం గెలుచుకుని ఒలింపిక్స్‌కు నేరుగా అర్హత సాధించింది. రింగ్‌లోకి దిగిందంటే ప్రత్యర్థులపై సింహంలా విరుచుకుపడుతూ వేగంగా పాయింట్లు సాధించే నిఖత్.. ఏదో ఒక పతకం కాకుండా ఏకంగా పసిడి పంచ్ విసరడానికి సిద్ధమైంది. 50 కిలోల విభాగంలో బరిలో ఉన్న నిఖత్ భారత్‌కు పతకం పక్కా తెచ్చే క్రీడాకారుల జాబితాలో ముందంజలో ఉంది.

### లవ్లీనా.. ఆ జోరు కొనసాగించేనా?

టోక్యో ఒలింపిక్స్‌లో ఏ అంచనాలు లేకుండానే బరిలోకి దిగి కాంస్యం గెలుచుకున్న 26 ఏండ్ల అసోం అమ్మాయి ఈసారి పతకం రంగు మార్చాలని భావిస్తోంది. అయితే గత ఒలింపిక్స్‌లో 69 కిలోల విభాగంలో బరిలో నిలిచిన లవ్లీనా ఈసారి 75 కిలోలకు మారడమే అతిపెద్ద సవాలు. గత మూడేండ్ల పాటు ఆమె ప్రదర్శన అంత ఆశాజనకంగా లేకపోయినా ఆసియా క్రీడల్లో రజతం, ఆసియా, వరల్డ్ చాంపియన్‌షిప్స్‌లలో స్వర్ణాలు సాధించి ఫామ్‌లోకి వచ్చింది. కానీ కొద్దిరోజుల క్రితమే ముగిసిన గ్రాండ్ ప్రిక్స్ ఈవెంట్‌లో ఒలింపిక్ శరణార్థుల జట్టు తరపున ఆడిన కిండి ఎంగంబ చేతిలో అనూహ్య ఓటమి ఆమెను కలవరపరుస్తోంది.





### పురుషుల విభాగంలో..

ఒలింపిక్స్‌లో భారత్‌కు తొలి పతకం అందించిన విజేందర్ తర్వాత మళ్లీ ఆ లోటును భర్తీ చేసేందుకు అమిత్ ఫంగాల్ (51 కిలోలు), నిషాంత్ దేవ్ (71 కిలోలు) పారిస్‌కు వెళ్లారు. టోక్యోలో నిరాశపరిచిన అమిత్.. ఆ అనుభవంతో పారిస్‌లో సత్తా చాటాలని ఉవ్విళ్లూరుతున్నాడు. ఇక తొలిసారి ఒలింపిక్స్ బరిలో నిలిచిన నిషాంత్.. గతేడాది వరల్డ్ చాంపియన్‌షిప్‌లో కాంస్యం గెలిచి తానేంటో నిరూపించుకున్నాడు. తనకంటే మెరుగైన ర్యాంకు కలిగిన బాక్సర్లను కంగుతినిపిస్తూ సత్తా చాటుతున్న దేవ్.. ఒలింపిక్స్‌లో ఏం చేస్తాడనేది ఆసక్తికరం.

### ఆ ఇద్దరూ మెరిస్తే..

మహిళల విభాగంలో నిఖత్, లవ్లీనాతో పాటు ప్రీతి పన్వర్ (54 కిలోలు), జాస్మిన్ లంబోరియా (57 కిలోలు) ఉన్నారు. కామన్వెల్త్ క్రీడల్లో కాంస్యం నెగ్గిన 22 ఏండ్ల జాస్మిన్.. ప్రవీణ్ హుడాపై నాడా నిషేధం నేపథ్యంలో పారిస్ టికెట్ దక్కించుకుంది. మరోవైపు 20 ఏండ్ల అమ్మాయి ప్రీతి సైతం ఆసియా క్రీడల్లో సెమీస్ చేరి అందర్నీ ఆశ్చర్యపరిచింది. ప్రీతి, జాస్మిన్‌పై పెద్దగా ఆశలేం లేకున్నా స్థాయికి తగ్గ ప్రదర్శన చేయగలిగితే క్వార్టర్స్ వరకు చేరడం పెద్ద కష్టమేం కాదు.

**ఒలింపిక్స్‌లో అత్యుత్తమ ప్రదర్శన**

| | | |
|---|---|---|
| 2008 | విజేందర్ సింగ్ | కాంస్యం |
| 2012 | మేరీ కోమ్ | కాంస్యం |
| 2020 | లవ్లీనా బోర్గొహెయిన్ | కాంస్యం |



# సెమీస్‌కు భారత్!

**యూఏఈపై ఘనవిజయం**

దంబుల్లా (శ్రీలంక): మహిళల ఆసియా కప్‌లో డిఫెండింగ్ చాంపియన్ భారత్ వరుసగా రెండో విజయం సాధించింది. తొలి మ్యాచ్‌లో పాకిస్థాన్‌ను చిత్తుగా ఓడించిన మన అమ్మాయిలు.. ఆదివారం యూనైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ)తో జరిగిన మ్యాచ్‌లోనూ 78 పరుగుల భారీ తేడాతో గెలిచి సెమీస్ బెర్తు ఖాయం చేసుకున్నారు. మ్యాచ్‌లో మొదట బ్యాటింగ్ చేసిన భారత్ నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 201 పరుగుల రికార్డు స్కోరు చేసింది. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ (47 బంతుల్లో 66, 7 ఫోర్లు, 1 సిక్స్), యువ వికెట్ కీపర్ రిచా ఘోష్ (29 బంతుల్లో 64 నాటౌట్, 12 ఫోర్లు, 1 సిక్స్) ధాటిగా ఆడటంతో ఈ ఫార్మాట్‌లో భారత్ 200 పరుగుల మార్కును తొలిసారిగా దాటింది. తన టీ20 కెరీర్‌లో తొలి అర్ధ శతకం సాధించిన రిచా బౌండరీలతో విరుచుకుపడింది. 26 బంతుల్లోనే ఫిఫ్టీ పూర్తిచేసిన ఆమె ఈ మ్యాచ్‌లో 64 పరుగులు చేస్తే అందులో 54 పరుగులు ఫోర్లు, సిక్స్ రూపంలో వచ్చినవే.ఈ ఇన్నింగ్స్‌తో రిచా మహిళల ఆసియా కప్‌లో అర్ధ శతకం సాధించిన తొలి భారత వికెట్ కీపర్‌గా రికార్డులకెక్కింది. అనంతరం ఛేదనలో యూఏఈ 20 ఓవర్లకు 7 వికెట్లు కోల్పోయి 123 పరుగులే చేయగలిగింది. ఆ జట్టులో కవిషా (32 బంతుల్లో 40, 3 ఫోర్లు, 1 సిక్స్) టాప్ స్కోరర్. కెప్టెన్ రోహిత్ ఒజా (38) రాణించింది. దీప్తి శర్మ (2/23) రాణించగా రేణుకా, తనూజా, రాధా యాదవ్ తలా ఓ వికెట్ తీశారు. ఇక ఈ టోర్నీలో భారత్ తమ తదుపరి మ్యాచ్‌ను మంగళవారం నేపాల్‌తో ఆడనుంది.

# టెన్నిస్ హాల్ ఆఫ్ ఫేమ్‌లో లియాండర్ పేస్


- **విజయ్ అమృత్‌రాజ్‌కూ చోటు**



ఢిల్లీ: భారత టెన్నిస్ దిగ్గజాలు లియాండర్ పేస్, విజయ్ అమృత్‌రాజ్‌కు అరుదైన గుర్తింపు దక్కింది. ఈ ఇద్దరూ 'ఇంటర్నేషనల్ హాల్ ఆఫ్ ఫేమ్'లో చోటు దక్కించుకోవడం ద్వారా ఈ ఘనత సాధించిన తొలి ఆసియా టెన్నిస్ ప్లేయర్లుగా నిలిచారు. 1996లో అట్లాంటా ఒలింపిక్స్‌లో కాంస్యం గెలిచిన పేస్ తన సుదీర్ఘ కెరీర్‌లో 8 పురుషుల డబుల్స్, 10 మిక్స్‌డ్ డబుల్స్ టైటిల్స్ నెగ్గాడు. 'ప్లేయర్ కేటగిరీ'లో పేస్‌కు ఈ గౌరవం దక్కింది. ఇక భారత పాతతరం టెన్నిస్ దిగ్గజం అమృత్‌రాజ్‌కు 'కాంట్రిబ్యూటర్ కేటగిరీ'లో గుర్తింపు దక్కింది. వింబుల్డన్, యూఎస్ ఓపెన్‌లో క్వార్టర్స్ చేరిన తొలి భారత టెన్నిస్ ప్లేయర్‌గా అమృత్‌రాజ్ రికార్డులకెక్కాడు. భారత్ నుంచి ఏటీపీ ర్యాంకింగ్స్‌లో 18వ ర్యాంకు (పురుషుల సింగిల్స్‌లో ఇప్పటికీ ఇదే అత్యుత్తమం) సాధించాడు.

# అథ్లెట్లకు అండగా బీసీసీఐ

- **రూ. 8.5 కోట్ల ఆర్థిక సాయం**



ముంబై: పారిస్ ఒలింపిక్స్‌లో పాల్గొనబోయే మన క్రీడాకారుల బృందానికి భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) రూ. 8.5 కోట్ల ఆర్థిక సాయం ప్రకటించింది. క్రీడాకారులకు ప్రోత్సాహకరంగా నిలిచేందుకు గాను ఈ మొత్తాన్ని భారత ఒలింపిక్ అసోసియేషన్ (ఐవోఏ)కు అందజేయనున్నట్టు బీసీసీఐ కార్యదర్శి జై షా తన 'ఎక్స్' ఖాతాలో వెల్లడించాడు. ఈ సందర్భంగా అథ్లెట్ల బృందానికి ఆయన శుభాకాంక్షలు చెప్పాడు.

## బౌలింగ్ కోచ్‌గా బహుతులే!

ముంబై: త్వరలో శ్రీలంక పర్యటనకు వెళ్లనున్న భారత క్రికెట్ జట్టుకు తాత్కాలిక బౌలింగ్ కోచ్‌గా మాజీ క్రికెటర్ సాయిరాజ్ బహుతులే నియమితుడు కానున్నట్టు సమాచారం. హెడ్‌కోచ్ గౌతం గంభీర్ తనకు బౌలింగ్ కోచ్‌గా దక్షిణాఫ్రికా మాజీ పేసర్ మోర్నీ మోర్కెల్ కావాలని బీసీసీఐ వద్ద పంతం నెగ్గించుకున్నా వ్యక్తిగత కారణాలతో అతడు లంకతో సిరీస్‌లో చేరేది అనుమానంగానే ఉంది. ఈ నేపథ్యంలో ప్రస్తుతం ఎన్‌సీఏలో ఉన్న బహుతులేను లంకతో సిరీస్ వరకు తాత్కాలిక బౌలింగ్ కోచ్‌గా నియమించనున్నట్టు బోర్డు వర్గాల సమాచారం.

# ఇంగ్లండ్ క్లీన్‌స్వీప్

**రెండో టెస్టులోనూ ఓడిన విండీస్**



ట్రెంట్‌బ్రిడ్జ్(నాటింగ్‌హామ్) : స్వదేశంలో వెస్టిండీస్‌తో జరిగిన రెండు మ్యాచ్‌ల టెస్టు సిరీస్‌ను ఇంగ్లండ్ 2–0తో క్లీన్‌స్వీప్ చేసింది. తొలి ఇన్నింగ్స్‌లో 41 పరుగులు వెనుకబడ్డ బెన్ స్టోక్స్ సేన.. రెండో ఇన్నింగ్స్‌లో 425 పరుగుల భారీ స్కోరు చేసింది. ఇంగ్లండ్ స్టార్ బ్యాటర్ జో రూట్ (122) టెస్టు కెరీర్‌లో 32వ సెంచరీ పూర్తిచేయగా యువ ఆటగాడు హ్యారీ బ్రూక్ (109) ఐదో టెస్టు శతకం చేశాడు. డకెట్ (76), ఓలీ పోప్ (51) సైతం రాణించడంతో ఆ జట్టు విండీస్ ఎదుట ఆతిథ్య జట్టు 385 పరుగుల విజయలక్ష్యాన్ని ఉంచింది. భారీ ఛేదనలో విండీస్ 36.1 ఓవర్లలో 143 పరుగులకే ఆలౌట్ అయి 241 పరుగుల తేడాతో పరాభవం పాలైంది. తొలి ఇన్నింగ్స్‌లో భారీ స్కోరు (457) చేసిన ఆ జట్టు రెండో ఇన్నింగ్స్‌లో తేలిపోయింది. ఓపెనర్లు క్రెయిగ్ బ్రాత్‌వైట్ (47), లూయిస్ (17) తొలి వికెట్‌కు 61 పరుగులు జోడించినా ఆ తర్వాత బ్యాటింగ్ ఆర్డర్ పేకమేడలా కూలిపోయింది. షోయబ్ బషీర్ (5/41), క్రిస్ వోక్స్ (2/28), అట్కిన్సన్ (2/49) ధాటికి విండీస్ వరుసగా వికెట్లు కోల్పోయి ఓటమిపాలైంది. లార్డ్స్ వేదికగా జరిగిన తొలి టెస్టులో ఇంగ్లండ్ ఘనవిజయం సాధించిన విషయం విదితమే.

PARIS 2024

**4 రోజుల్లో**



## బాంబ్రీ జోడీదే టైటిల్

స్విట్జర్లాండ్: భారత టెన్నిస్ ఆటగాడు యుకీ బాంబ్రీ తన ఫ్రెంచ్ సహచరుడు అల్బానో ఒలివెట్‌తో కలిసి స్విస్ ఓపెన్ ఏటీపీ 250 టూర్‌లో పురుషుల డబుల్స్ టైటిల్ గెలుచుకున్నారు. ఆదివారం జరిగిన ఫైనల్‌లో బాంబ్రీ–ఒలివెట్ ద్వయం 3–6, 6–3, 10–6తో ఉగో హంబర్ట్–ఫాబ్రిస్ మార్టిన్ (ఫ్రాన్స్)ను ఓడించారు. బాంబ్రీకి కెరీర్‌లో ఇది మూడో ఏటీపీ టైటిల్ కాగా ఒలివెట్‌తో కలిసి రెండోది.



*యూఎస్‌ఏ వేదికగా జరిగిన ఐటీఎఫ్ ఉమెన్స్ వరల్డ్ టూర్ ఫైనల్‌లో తెలంగాణ అమ్మాయి సహజ ఎల్లంపల్లి, హిరొకొ కువాటా (జపాన్) ద్వయం 6–6, 0–6తో అలిసియా లినాన (స్పెయిన్), మెలని క్రివొజ్ (అర్జెంటీనా) చేతిలో ఓడి రన్నరప్‌గా నిలిచింది.*




Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No. 437, Near Velama Kalyana Mandapam, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.